క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



కనక సింహాచలంను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

డెంకాడ: డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలంను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం పరామర్శించారు. కనకసింహాచలం కాలు దెబ్బతినడంతో డెంకాడలోని ఇంటిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, తదితరులు పరామర్శించారు.

గొడిపాలెంలో డీఎంహెచ్ఓ పర్యటన



బావిని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

డెంకాడ: మండలంలోని గొడిపాలెంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి భాస్కరరావు గురువారం పర్యటించారు. గొడిపాలెంలో డయేరియా ప్రబలిన నేపథ్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే గ్రామంలో పర్యటించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బంగారు సరోజిని

నెల్లిమర్ల రూరల్: పట్టణ పరిధిలోని నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ప్రశాంతంగా ముగిసింది. చైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన నగర పంచాయతీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రధానంగా చర్చ సాగింది. వీధి లైట్లు, తాగునీటి సమస్యలను పలువురు కౌన్సిలర్లు ప్రస్తావించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కౌన్సిలర్లు జానా సంధ్యారాణి, నల్లి కృష్ణవేణి, బూర సుజాత, మాత సంధ్య, మజ్జి రామలక్ష్మి, మైపాడ ప్రసాద్, తుమ్ము నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో 'నా భూమి - నా దేశం'



మొక్కలు నాటిన నాయకులు, ఉపాధ్యాయులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త బుట్టల పంపిణీ



చెత్తబుట్టలను అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం చెత్తబుట్టలు పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయానికి 15 వందల చెత్తబుట్టలురాగా.. వీటిని ఆయా గ్రామాల ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీలు పిన్నింటి తమ్మునాయుడు, కూరాలకు అనిత, గుణుపూరుపేట సర్పంచ్ పైల ముత్యాలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న,రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నిరసన



నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఎం నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 33వ డివిజన్ ముచ్చెరువు గట్టు వద్ద సంతకాలు సేకరించి, కరెంట్ బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం సభ్యులు ఎ. జగన్ మోహనరావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 15లోగా విస్తరణ పనులు

- నగరంలోని ఎత్తు బ్రిడ్జి వద్ద మోడ్రన్ బస్ స్టాప్
- పనుల ప్రగతిని పరిశీలించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మయూరి జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న రహదారి విస్తరణ పనులు అక్టోబర్ 15 నాటికి పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదేశించారు. నగరంలోని మయూరి జంక్షన్ – అంబేద్కర్ జంక్షన్ వరకు జరుగుతున్న రహదారి విస్తరణ పనులతో పాటు ఎత్తు బ్రిడ్జిపై నూతనంగా నిర్మించనున్న మోడరన్ బస్టాప్ ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కార్పొరేషన్ ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు.

అనంతరం కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, నగరంలోని వివిధ అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి పరిశీలించామని చెప్పారు. మయూరి కూడలి నుంచి సెంటర్ డివైడర్లు, బ్యూటిఫికేషన్ పనులపై డిప్యూటీ స్పీకర్ సూచనలు చేశారన్నారు. అక్టోబర్ 15 నాటికి ఈ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఎత్తు బ్రిడ్జి వద్ద పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు వేచి ఉండేందుకు అత్యాధునిక సదుపాయాలతో బస్టాప్ నిర్మించనున్నట్లు చెప్పారు. ఎత్తుబ్రిడ్జి నుంచి విశాఖ వెళ్లే మార్గంలో రహదారి విస్తరణ చేయడంతో పాటు బస్టాప్ నిర్మాణానికి రూ.25 లక్షలు కేటాయించారని, ఈ పనులు పైడితల్లి జాతర సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాకినాడకు చెందిన ఓ సంస్థ భాగస్వామ్యంతో ఆధునిక హంగులతో ప్రయాణికుల సౌకర్యార్థం బస్ బేను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ రెస్ట్ రూములు, తాగునీరు, ఏసీ, ఏటీఎం వంటి సౌకర్యాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఈ పంట నమోదు

- జిల్లా వ్యవసాయాధికారి తారక రామారావు



సీతారామునిపేటలో ఈ - క్రాప్ నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి తారకరామారావు

నెల్లిమర్ల రూరల్: ఈ – పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వి. తారకరామారావు ఆదేశించారు. మండలంలోని సీతారామునిపేటలో జరుగుతున్న ఈ పంట నమోదును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి రైతూ సాగుచేసే పంటల వివరాలను ఈ నెల 15వ తేదీ లోపు తప్పనిసరిగా ఈ – పంట యాప్‌లో నమోదు చేయాలన్నారు. నమోదు చేసుకోకపోతే పంట నష్టపరిహారం, క్రాప్ ఇన్సూరెన్స్, ధాన్యం కొనుగోలు, ఇతర పథకాలు వర్తించవని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి రైతుభరోసా కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉంటారని, వారి వద్దకు వెళ్లి వివరాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ ఎన్. కోటేశ్వరరావు, ఏఈఓ నాగరాజు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



డెంకాడ: వరిపంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి టి.సంగీత

పంట నమోదు తప్పనిసరి..

డెంకాడ: రైతులు తాము సాగుచేస్తున్న పంటల వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని డీఆర్సీ వ్యవసాయాధికారి టి. సంగీత అన్నారు. మండలంలోని సింగవరంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి , గ్రామీణ విత్తనోత్పత్తి కార్యక్రమంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ పంట నమోదు వల్ల బీమా సౌకర్యం, మద్దతు ధర, పంట నష్ట పరిహారం వంటివి అందుతాయన్నారు. అనంతరం వరి పంటకు తెగుళ్లు సోకకుండా ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు. కార్యక్రమంలో ఏఓ నిర్మల, ఏఈఓ రామకోటి, తదితరులు పాల్గొన్నారు.

గాజుల అలంకరణలో పైడితల్లి



పూజలందుకుంటున్న పైడితల్లి

విజయనగరం టౌన్: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నున్న వనంగుడిలో కొలువైన పైడితల్లి అమ్మవారిని శ్రావణమాసం సందర్భంగా గురువారం గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు పాపారావు ప్రత్యేక పూజలు చేశారు. వసంతవిహార్‌కి చెందిన జి.మహాలక్ష్మి గాజులు సమకూర్చారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం కోడూరు పంచాయతీలోని రిక్షా కాలనీలో ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కాలనీ యువత ఆధ్వర్యంలో సుమారు రూ.4లక్షలతో ఆలయాన్ని నిర్మించారు. ప్రతిష్ఠోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక నాయకులు గేదెల ఆదినారాయణ, గేదెల శంకరరావు, కుప్పిలి చంద్రమౌళి, కుప్పిలి సత్యనారాయణ,యువత పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

విజయనగరం ఫూల్‌బాగ్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా మోదీ హఠావో..దేశ్ కి బచావో పేరుతో అక్టోబర్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తయినా ప్రజల జీవితాల్లో ఎటువంటి మార్పు లేదన్నారు. బ్రిటిష్ వాడిని మన దేశం నుంచి వెళ్లగొట్టడానికి భారతదేశంలో ఉన్న అన్ని కులాలు, అన్ని మతాలు, అన్ని వర్గాల వారు పోరాటం చేస్తే.. స్వాతంత్ర్యం వచ్చాక మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి హత్యలకు పాల్పడుతుంటే కేంద్ర ప్రభుత్వం మిన్నకుండిపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ, నాయకులు వంజరాపు.లక్ష్మి, వి.లక్ష్మి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రమాదేవి, తదితరులు

సంతకాల సేకరణ

నెల్లిమర్ల రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ పాలనకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. స్థానిక మొయిద జంక్షన్ వద్ద పలువురు యువతీ, యువకులు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు మాట్లాడుతూ, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తోందన్నారు. నిత్యావసర ధరలు సామాన్యుడికి అందుబాటులో లేవని, సామాన్యుడి నడ్డి విరిస్తూ సంపన్నుల అభ్యున్నతికి పాటు పడుతున్న మోదీకి బుద్ధి చెప్పాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అన్ని వర్గాల ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ మూర్తి, లెనిన్ పాల్గొన్నారు.



మొయిద జంక్షన్‌లో సంతకాలు చేస్తున్న యువకులు

ప్రతి ఇంటా రాఖీ సంబరాలు



విజయనగరం రూరల్: జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావుకు రాఖీ కడుతున్న ఆయన సోదరీమణి

విజయనగరం రూరల్: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఇంట రాఖీ సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. శ్రీనివాసరావుకు ఆయన సోదరీమణులు కోరాడ అమృతవల్లి, బడ్డుకొండ పద్మ, అలజంగి రమ రాఖీలు కట్టి మంగళహారతులతో ఆశీర్వదించారు. అలాగే జెడ్పీ చైర్మన్, పుష్పాంజలి దంపతుల కుమార్తె బడ్డుకొండ సిరి సహస్ర, తన సోదరుడు సాయిమోహిత్‌కు రాఖీ కట్టారు.

ట్రాఫిక్ పోలీసులకు రాఖీ పౌర్ణిమ శుభాకాంక్షలు..

విజయనగరం అర్బన్: రాఖీ పౌర్ణిమ ఉత్సవాలను పాఠశాల విద్యార్థినులు నగర వీధుల్లో ఉత్సాహంగా నిర్వహించారు. ఇన్‌స్పైర్ స్కూల్‌కి చెందిన బాలికలు పట్టణంలోని సంతకాల బ్రిడ్జ్ రహదారిపై విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు రాఖీలు కట్టి సోదరి భావాన్ని పంచుకున్నారు. సుమారు 40 మంది ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది రాఖీలు కట్టారు. అలాగే పోలీస్ విధులపై అవగాహన ఏర్పరచుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్, అకడమిక్ డైరెక్టర్ రవి కె. మండా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ బత్తుల చందు, వైస్ ప్రిన్సిపాల్ రాగసుధ, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.



విజయనగరం అర్బన్: రోడ్డుమీద విధుల్లో ఉన్న పోలీసులకు రాఖీ కడుతున్న బాలికలు

కోలగట్ల నివాసంలో..

విజయనగరం: డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, కార్పొరేటర్ ఇసరపు రేవతీదేవి, పలువురు మహిళా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, హిజ్రాలు పెద్ద ఎత్తున తరలివచ్చి కోలగట్లకు రాఖీ కట్టి తిలకం దిద్దారు. రక్షాబంధన్ సందర్భంగా తన మీద అభిమానంతో రాఖీ కట్టిన సోదరీమణులందరికీ ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.



విజయనగరం: కోలగట్ల వీరభద్రస్వామికి రాఖీ కడుతున్న నగర మేయర్ విజయలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్లు

నగర పంచాయతీ కార్యాలయంలో..

నెల్లిమర్ల రూరల్: పట్టణంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు మహిళ ఉద్యోగులు... వైస్ చైర్మన్ సముద్రపు రామారావుతో పాటు కౌన్సిలర్లకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.



నెల్లిమర్ల రూరల్ : నగర పంచాయతీ వైస్ చైర్మన్ రామారావుకు రాఖీ కడుతున్న చైర్‌పర్సన్ బంగారు సరోజిని

సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలే రక్ష



ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు రాఖీ కడుతున్న మండల స్థాయి అధికారిణి

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: రాష్ట్రంలో ఉన్న సంక్షేమ ప్రభుత్వాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన రక్షాబంధన్ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పలువురు పొదుపు సంఘాల మహిళలు ప్రజాప్రతినిధులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు, తదితరులు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో కూడా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనన్నారు. ప్రతి కుటుంబాన్నీ ఓ బిడ్డ మాదిరిగా ముఖ్యమంత్రి జగనన్న ఆదుకుంటున్నారని చెప్పారు. చంద్రబాబు హయాంలో డ్వాక్రా రుణమాఫీ అపహాస్యం పాలైందన్నారు. అదే సీఎం జగనన్న మాత్రం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశారని తెలిపారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను చక్కగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, నెల్లిమర్ల జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు పిన్నింటి తమ్మునాయుడు, కూరాకుల అనిత, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఏపీఎం విజయలక్ష్మి, ఏఓ నిర్మల, పొదుపు సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీని గద్దె దించాలి

- సీపీఎం నాయకుడు సూర్యనారాయణ

భోగాపురం: ఒక్క ఎన్నికల హామీని కూడా నెరవేర్చని ప్రధాని మోదీని గద్దె దించాలని సీపీఎం నాయకుడు బి. సూర్యనారాయణ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ మండల కేంద్రంలో గురువారం ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2014 ఎన్నికల సమయంలో మోదీ అనేక హామీలు గుప్పించారని, అందులో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని.. అలాగే నల్లధనాన్ని వెలికితీసి ప్రతి ఒక్కరి బ్యాంక్ ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఉగ్రవాదాన్ని అరికట్టి దేశంలో పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తానన్న హామీ కూడా నీటిమూటగానే మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, దేశ సంపదను అంబానీ, అదానీ వంటి బడా పెట్టుబడుదారులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. అందులో భాగంగానే ఎయిర్‌పోర్టులు, రైల్వే, ఎల్ఐసీ వంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మోదీని గద్దె దించేందుకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వసుం రమణ, పిట్టా రామసూరి, మరాడ రవి, రాము, శ్రీను పాల్గొన్నారు.



భోగాపురంలో ప్రచార భేరి నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

నీటి సరఫరాకు అంతరాయం

- కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. శ్రీనివాసరావు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌లకు కుళాయిల ద్వారా నీటి సరఫరాకు అంతరాయం కలగనుందని కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక కార్పొరేషన్ ఇంజినీరింగ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకం నుంచి విజయనగరానికి మంచి నీటి సరఫరా చేసే పైప్‌లైన్లకు ఇంటర్ కనెక్షన్ చేసే పనులు చేపట్టనున్న నేపథ్యంలో నాలుగు రోజుల పాటు నీటి సరఫరాకు ఆటంకం కలగనుందన్నారు. శుక్రవారం నుంచి నాలుగో తేదీ వరకు నగరంలోని 37, 38, 38, 39, 40, 41, 43, 44, 46, 47 డివిజన్ల పరిధిలోని ప్రాంతాలకు కుళాయిల ద్వారా కాకుండా ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఈఈ ఎస్. అప్పారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయనగరం: అర్హులైన వారందరికీ రాజకీయాకతీతంగా సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల తమ్మన్నశెట్టి అన్నారు. నగరంలోని 40 డివిజన్ ఎల్‌బీ నగర్ నుంచి గురువారం సాయంత్రం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో కోలగట్ల తమ్మన్నశెట్టి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుతో పాటు ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. అనంతరం తమన్నశెట్టి మాట్లాడుతూ, వలంటీర్ల ద్వారా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందిస్తున్నందుకు ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మి మాట్లాడుతూ, తమ వార్డులో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేశామన్నారు. అదే విధంగా మౌలిక వసతుల కల్పన కూడా దాదాపు 80 శాతం పూర్తి చేశామని తెలిపారు. అభివృద్ధికి అండగా నిలిచిన స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామికి ప్రతి ఒక్కరూ అండగా ఉండి మరలా గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ దూబే, పార్టీ నాయకులు గాలి భాస్కరరావు, మురళి, డివిజన్ అధ్యక్షుడు వాసుదేవరావు, మహిళా అధ్యక్షురాలు నందిని, యువజన అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.